క్లుప్తంగా

ఆలయాల పునర్నిర్మాణానికి విరాళాల వెల్లువ

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ గోపుర పునర్నిర్మాణ, అభివృద్ధి, స్థానిక శ్రీ గంగానమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ పనులకు దాతల నుంచి విరాళాలు వెల్లువెత్తాయి. తమ విరాళాలను శుక్రవారం గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు అందజేశారు. స్వర్గీయ వల్లభనేని జగన్మోహన్‌రావు కుమారుడు వల్లభనేని ఈశ్వరరావు(చంటి) రూ.10వేలు, వారి మనవడు వల్లభనేని ప్రసన్నకృష్ణ రూ.10వేలు, గుడివాడకు చెందిన జి.రంగప్రసాద్ రూ.13వేలు, దివంగత వడ్లమూడి విజయలక్ష్మి జ్ఞాపకార్థం వారి భర్త వడ్లమూడి రాజా రామ్మోహనరావు రూ.65వేలు, ఉచ్చుల రవికుమార్ గారు రూ.5వేలు, అడుసుమిల్లి వెంకట రమణరావు రూ.5116ను అందజేశారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



పమిడిముక్కల: తాడంకి హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలో ప్రతిభ చాటారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లా స్థాయి కబడ్డీ అండర్–22 విభాగంలో బాలుర, బాలికల ఎంపికలు ఇటీవల అవనిగడ్డ హైస్కూల్లో నిర్వహించారు. బాలికల విభాగంలో కంభపు బుజ్జి, సరగడ జ్యోష్ణవి, బోయి వెంకటలక్ష్మి, పిండింట్ల పల్లవి, సాడి దీపిక ఎంపికయ్యారని హెచ్ఎం ప్రసాద్ తెలిపారు. ఈ నెల 11వ తేదీన గుంటూరులో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని పేర్కొన్నారు. హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు పి.రవీంద్రబాబును, ఎంపికైన విద్యార్థినులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

వృద్ధులకు భోజనం అందజేత



గుడివాడరూరల్: చింత పుల్లయ్య వర్ధంతి సందర్భంగా పట్టణంలోని మందపాడు వద్ద ఉన్న నైట్ షెల్టర్ ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులకు, పేదలకు పుల్లయ్య కుటుంబ సభ్యులు ఇచ్చిన భోజనాలను పట్టణ బీజేపీ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ శుక్రవారం అందజేశారు. లంకా రాంబాబు, గాదే చరణ్, మహ్మద్ హుస్సేన్, అయ్యప్ప పాల్గొన్నారు.

స్నేహితుడిపై దాడి చేశారంటూ ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్: తన స్నేహితుడిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేశారంటూ ఓ వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. మండలంలోని గురజకు చెందిన తోట చాణిక్యసాయికి అదే గ్రామానికి చెందిన పామర్తి జశ్వంత్ స్నేహితుడు. జశ్వంత్‌కు గురజకు చెందిన పోకల భగవాన్ గతంలో విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం చాణక్యసాయి తన స్నేహితుడు జశ్వంత్, ఇతరులతో స్థానిక పంటకాలువలో స్నానం చేస్తుండగా భగవాన్‌తో పాటు పీరిశెట్టి వెంకటేష్ కాలువ వద్దకు వచ్చి జశ్వంత్‌తో గొడవపడి తన వెంట తెచ్చుకున్న రాడ్డుతో తలపై కొట్టారు. దీంతో అతడి తలపై తీవ్ర గాయమైంది. గాయపడ్డ జశ్వంత్‌ను గుడివాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి పవిత్రోత్సవాలు



తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల మూడో రోజైన శుక్రవారం స్వామికి ఆలయ అర్చకుడు విజయకుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో నిత్యార్చన, అధివాస హోమాలు, ద్వాదశ కలశస్థాపన, విశేష తిరుమంజనం, నూతన వస్త్ర, పుష్పాలంకరణ, పవిత్ర సమర్పణ జరిగాయి. సాయంత్రం విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హరిదుర్గా నాగేశ్వరరావు, గుమ్మస్తా శ్రీనివాసరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

జూదరుల అరెస్ట్

గుడ్లవల్లేరు: మండలంలోని కూరాడ లాకు దిగువున కొబ్బరి తోటలో పేకాట ఆడుతున్న శిబిరంపై శుక్రవారం గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ తన సిబ్బందితో దాడి చేశారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.15వేల నగదు, రెండు వాహనాలను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులను గుడివాడ కోర్టుకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.

అన్నదాతకు సాగునీటి గండం!

నీరందక ఎండిపోతున్న వరిచేలు



చిగురుకోటలో ఎండిపోతున్న వరిని ఎంపీపీకి చూపుతున్న రైతు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో రైతులను సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. వరుణుడి జాడ లేక ఇటు కాలువల నుంచి సాగునీరందక ఎండిపోతున్న వరిపైర్లను చూస్తూ తీవ్ర వ్యధకు గురవుతున్నారు. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే సార్వా పంటను తీవ్రంగా నష్టపోక తప్పదనే భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రధానంగా చిగురుకోట, నరసన్నపాలెం, చిన్నకామనపూడి, పెదకామనపూడి గ్రామాల్లో సార్వా పంటకు నేరుగా విత్తనాలు వెదజల్లి సాగు చేపట్టారు. ఇవి మొలకదశ ప్రారంభమై చిగురుటాకులు వేసినప్పటి నుంచి సాగునీరు అందక పైరు పెరగక గిడసబారిపోతున్నాయి. పోల్‌రాజ్ ప్రధాన కాలువ నుంచి వెళ్లే బ్రాంచి కాలువల ద్వారా ఈ గ్రామాల్లోని భూములకు సాగునీరు అందాల్సి ఉంది. బ్రాంచి కాలువలకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేసే అవకాశం లేకపోవడంతో శివారు భూములకు సాగునీరు అందడం లేదు.

ఎగువ భూములకే నీరు

పోల్‌రాజ్ ప్రధానకాలువ నీటి ప్రవాహ సామర్థ్యం కేవలం 400 క్యూసెక్కుల మాత్రమేనని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ కాలువను ఏళ్ల తరబడి తవ్వకపోవడంతో పూర్తి సామర్థ్యంలో నీటిని విడుదల చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో కేవలం 350 క్యూసెక్కుల మాత్రమే ప్రవహిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ కాస్త నీరు ఎగువ గ్రామాల్లోని భూములకు తరలిపోతున్నట్లు రైతులు తెలిపారు. అదేవిధంగా కాలువ దిగువ ప్రాంతంలో కొన్ని గ్రామాల వద్ద కాలువను తవ్వడంతో వస్తున్న కొద్దిగొప్పో నీరు దిగువకు వెళ్లిపోతున్నట్లు చెబుతున్నారు. దీంతో మధ్యలో ఉన్న తమ భూములకు నీరు అందడం లేదని వాపోతున్నారు.

వేధిస్తున్న కలుపు సమస్య

సాగునీరు అందకపోవడంతో పైర్లలో కలుపు పెరిగిపోతోంది. దీనిని నివారించేందుకు మందులు పిచికారీ చేయాల్సి ఉన్నప్పటికీ నీరు లేనందున అవకాశం లేకుండా పోయింది. కలుపు నివారణ మందు చల్లిన వెంటనే పైరుకు తడి ఇవ్వాల్సి ఉంటుంది. అలాంటి పరిస్థితి లేనందున పైరును మించి కలుపు పెరిగిపోతోంది.

ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలి

ఎండిపోతున్న పైర్లను కాపాడేందుకు స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ వెంటనే చర్యలు తీసుకోవాలి. బ్రాంచి కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసి శివారు భూములకు సాగునీరు అందించేందుకు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి రైతులు నష్టపోకుండా చూడాలి.

– రామిశెట్టి సత్యనారాయణ, ముదినేపల్లి ఎంపీపీ

తీరని నష్టం



20 ఎకరాల్లో సార్వ వరిసాగు చేపట్టాను. విత్తనాలు వెదజల్లినప్పటి నుంచి సాగునీటి కోసం అవస్థలు పడుతున్నాం. ప్రస్తుతం పైరు ఎండిపోయే దశకు చేరుకుంది. రెండు మూడు రోజుల్లో నీరు అందకుంటే తీవ్రంగా నష్టపోతాననే భయం వెంటాడుతోంది.

– కోమటి విష్ణువర్ధన్, రైతు, వైఎస్సార్ సీపీ నాయకుడు, చిగురుకోట

ఎమ్మెల్యే విధేయుడికే కొండలమ్మ ఆలయ చైర్మన్ గిరి?

నూతన చైర్మన్‌కు సమస్యల స్వాగతం



మోహన్‌రావు

గుడ్లవల్లేరు: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు చెందిన వీర విధేయుడికే శ్రీ కొండలమ్మ ఆలయ చైర్మన్ పదవి దక్కేటట్లు ఉంది. జిల్లాలో ఆదాయ పరంగా ప్రఖ్యాతి గాంచిన శక్తి ఆలయం మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానం. శుక్రవారం ఈ ఆలయ ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్‌ను అధికారులు విడుదల చేశారు. దీంతో ఎమ్మెల్యేకు విధేయుడైన మండలంలోని కట్టవానిచెరువు శివారు చింతలగుంటకు చెందిన ఈడె వెంకట విష్ణుమోహన్‌రావు(మోహన్) పేరు అందరిలో చర్చానీయాంసంగా మారింది. మోహన్ సామాజిక వర్గానికి చెందిన నలుగురు టీడీపీ నాయకుల పేర్లు నిన్నటి వరకు ప్రచారంలో ఉన్నాయి. ఈ నోటిఫికేషన్ రాగానే ఎమ్మెల్యే రాము తరపున మోహన్ పేరు బలంగా వినబడటంతో ఆ పాత ప్రచారానికి తెర పడింది.

రాబోయే నూతన చైర్మన్‌కు సవాళ్లెన్నో..

నూతన చైర్మన్‌కు ఆలయ పరిపాలనా వ్యవహారాల్లో ఎన్నో సవాళ్లు స్వాగతం పలకనున్నాయి. గతేడాది దసరా నవరాత్రుల్లో జరిగిన కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే క్రమంలో వినియోగించిన ఉత్సవాల నిధుల వినియోగంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే చీరలు, కొబ్బరి చిప్పలు, ధాన్యం సేకరణలో కొంతమంది అమ్మవారికి రూ.40లక్షల వరకు బకాయిలు పడ్డారు. ఇలాంటి సమస్యలు ఎన్నో రానున్న నూతన చైర్మన్‌కు దేవస్థాన పరిపాలనా వ్యవహారంలో సవాళ్లగా మారనున్నాయి. కష్ణా జిల్లాలోనే శక్తి ఆలయాల్లో దేవదాయ లెక్కల ప్రకారం ఆదాయంలో ప్రాధాన్యంతో ఈ ఆలయం నమోదు కాబడింది. 2005లో ఈ ఆలయాన్ని దేవదాయ ధర్మాదాయ శాఖ వారు స్వాధీనం చేసుకున్నారు. తొలి చైర్మన్‌గా తాళ్లూరి మాధవ్, మేనేజర్‌గా జక్కా ధర్మారాయుడిని అప్పటి ప్రభుత్వం నియమించింది. భక్తుల నుంచి ఏడాదికి దాదాపు ఒక రూ.కోటి కానుకల రూపంలో ఆదాయం వస్తుంది.

20 రోజుల్లోపు దరఖాస్తులు పంపాలి

శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానానికి దేవదాయ ధర్మదాయ కమిషనర్ గొల్లపూడి వారి ఉత్తర్వుల ప్రకారం నూతన ధర్మకర్తల మండలి నియామకం నోటిఫికేషన్ జారీ అయింది. శుక్రవారం నుంచి 20రోజుల లోపు ఆసక్తితో పాటు అర్హత కలిగిన అభ్యర్థులు దేవదాయ ధర్మదాయ చట్టంలో నిర్ణయించబడిన ప్రోఫార్మా–2 ప్రకారం దరఖాస్తులను నాకు పంపాలి.

– ఆకుల కొండలరావు, ఆలయ ఈఓ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: పెదపారుపూడి విద్యుత్ సబ్ స్టేషన్‌లో లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఏఈ వరకుమార్ శుక్రవారం తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చిత్తర్వుకు డాక్టరేట్



గుడ్లవల్లేరు: చిట్టి నిధుల చట్టంపై పరిశోధనకు మామిడికోళ్లకు చెందిన ప్రముఖ న్యాయవాది చిత్తర్వు వేణుగోపాలరావు డాక్టరేట్ పొందారు. ఈ విషయాన్ని ఆయన శుక్రవారం విలేకరులకు తెలిపారు. చట్టపరమైన సంస్కరణలు, ప్రజాసేవ, భారత న్యాయవ్యవస్థ అభివృద్ధికి చేసిన అసాధారణ సేవలకు గుర్తింపుగా తనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ బహూకరించారని పేర్కొన్నారు. ఈ గౌరవాన్ని విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని చారిత్రక టాగోర్ ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక సభలో ప్రదానం చేశారని తెలిపారు.

ఇల్లు దగ్ధం



ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదకామనపూడిలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన పెనుమాళ్ల ప్రసాద్ ఇల్లు, గడ్డివాము ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ప్రమాదానికి సరైన కారణం తెలియరాలేదు. సమాచారం తెలుసుకున్న బొర్రా బాలసాయి చారిటబుల్ ట్రస్ట్ తరపున రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

గంగానమ్మ జాతర ప్రారంభం

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో యాదవ సంఘం ఆధ్వర్యంలో గంగానమ్మ జాతర కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. మొదటి రోజైన శుక్రవారం పీహెచ్‌సీ రోడ్డులోని మహాలక్ష్మి అమ్మవారి చెట్టుకి భక్తులు మానుపూజ నిర్వహించారు. పడమర యాదవ రామాలయం, తూర్పు యాదవ రామాలయం వద్ద నుంచి భక్తులు పెద్ద ఎత్తున మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి మానుపూజ జరిపారు. ఆయా కార్యక్రమాలను యాదవ సంఘం ప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు.

బీసీ ఎమ్మెల్సీపై దాడికి ఖండన

పెదపారుపూడి: అధికారం ఉందని టీడీపీ నాయకులు పులివెందుల ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి చేయటం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఆల రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బీసీ వర్గాలకు చెందిన నాయకులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ ఓటమి తప్పదనే అక్కసుతోనే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీపై దాడిని ప్రథకం ప్రకారం చేశారని తెలిపారు. ఇటీవల గుడివాడలోని జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్, బీసీ మహిళా నేత ఉప్పాల హారికపై టీడీపీ నాయకులు దాడి చేశారని పేర్కొన్నారు. బీసీలపై జరుగుతున్న దాడులను రాష్ట్రంలో బీసీలందరూ గమనిస్తూనే ఉన్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పటం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: తాళం వేసి ఉన్న ఇంట్లో చాకచక్యంగా చోరీకి పాల్పడుతున్న ముఠాను హనుమాన్‌జంక్షన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ దొంగల ముఠాకు ఓ ట్రాన్స్‌జెండర్ లీడర్ కావటం గమనార్హం. వివరాల్లోకి వెళ్లితే.. బాపులపాడు మండలం ఓగిరాలకు చెందిన జూట్రు రంగమ్మ వ్యాపారం నిమిత్తం నెల రోజుల క్రితం ఖమ్మం వెళ్లింది. గత నెల 23వ తేదీన రంగమ్మ ఇంటి తాళాలు పగలకొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు ఆమెకు సమాచారం అందించారు. దీంతో ఇంటికి తిరిగి వచ్చిన రంగమ్మ బీరువాలో భద్రపర్చిన బంగారం, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లుగా గుర్తించింది. ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ– 2 ఎస్ఎల్ నరసింహమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దొంగతనం జరిగిన తీరు, సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఎట్టకేలకు చోరీకి పాల్పడినవారిని శుక్రవారం పట్టుకున్నారు. ఏలూరుకు చెందిన ట్రాన్స్‌జెండర్ షేక్ మున్నా అలియాస్ సిరితో పాటుగా కాకినాడకు చెందిన కొఠారి శ్రీనివాస్ అలియాస్ వాసు, గుడివాడకు చెందిన పడమట మణికంఠలను ఎస్ఐ నరసింహామూర్తి అరెస్ట్ చేశారు. ఈ ముగ్గురిపై గతంలోనూ ఏలూరు, గుడివాడ, హనుమాన్‌జంక్షన్, పలు పోలీస్‌స్టేషన్లలో చోరీ కేసులు ఉన్నట్లుగా ఆయన చెప్పారు. ఈ ముగ్గురి నుంచి ఓగిరాలలో చోరీ చేసిన రూ.80 వేల విలువ చేసే బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లుగా ఎస్ఐ పేర్కొన్నారు.

ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయం చూపాలి

చల్లపల్లి: మహిళలకు ఉచిత బస్సు నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలకు కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 15వ తేదీ నుంచి మహిళల కోసం ఆర్టీసీ ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక కృష్ణా జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ రేపల్లె పాయింట్ వద్ద ఆటో కార్మికులతో కలిసి కరీముల్లా మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతారని అన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అములు చేయాలని డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ఆటో కార్మికునికి ఆటో మిత్ర పథకం కింద ఏడాదికి రూ. 25వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని కోరారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 12వ తేదీన కలెక్టర్‌ను కలవనున్నట్లు తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేధింపులకు గురిచేస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు చేయగా కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు టీనర్‌పేట కొండ ప్రాంతంలో షేక్ హేమలత, చాన్‌బాషా కుటుంబం నివాసం ఉంటుంది. వీరిద్దరిది ప్రేమ వివాహం కాగా, ఒక బాబు సంతానం. ఆటో నడుపుకుని జీవనం సాగించే చాన్‌బాషా కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. భార్యను వేధింపులకు గురి చేయడమే కాకుండా పుట్టింటికి వెళ్లి కట్నం తీసుకురావాలని ఒత్తిడి చేసేవాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

గుడ్లవల్లేరు: మండలంలోని కౌతవరం చెక్‌పోస్ట్ వద్ద ఉన్న సొసైటీ పెట్రోల్ బంక్‌లో జరిగిన దాడిలో ఆరుగురిపై గుడ్లవల్లేరు పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ కథనం మేరకు గురువారం సాయంత్రం బంక్‌లో పని చేస్తున్న మేనేజర్ పెద్ది వీరాంజనేయులు, రాముపై బొంతు శ్రీనివాసరావు, సాయి, మరొక నలుగురు అకారణంగా దాడి చేశారు. అంతేగాక బంక్‌లో కుర్చీలు, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. గాయాలపాలైన వీరాంజనేయులు, రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనివాసరావు, సాయి, మరొక నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి

ముదినేపల్లి రూరల్: తీవ్రంగా నష్టపోతున్న ఆక్వా రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్రకార్యదర్శి, ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లిలో స్థానిక విలేకరులతో ఆక్వారైతుల సమస్యలపై శుక్రవారం మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న అధిక సుంకాలు ఆక్వా రంగంపై తీవ్రప్రభావం చూపుతున్నట్లు తెలిపారు. ఆక్వా ఎగుమతుల వల్ల విదేశీ వాణిజ్యం పొందే కేంద్రం తక్షణమే స్పందించి రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పార్టీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, ఆక్వారైతులు రామిశెట్టి ప్రసాద్, అభిలాష్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా

మండవల్లి: మండలంలోని లోకుమూడిలో నిబంధనలు పాటించని వాహనదారులకు పోలీసులు శుక్రవారం సాయంత్రం జరిమానా విధించారు. ఎస్ఐ రామచంద్రరావు వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి 10 మంది వాహనదారులకు రూ. 2,885 జరిమానా విధించారు. పాత కేసులు ఉన్న వాహనాల నుంచి రూ. 1,800 వసూలు చేశారు.

మహాలక్ష్మీ నమోస్తుతే..

ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు



కూచిపూడిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు



గుడ్లవల్లేరు మండలంలో పూజలు

కూచిపూడి(మొవ్వ): శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా పలు పట్టణాలు, గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు నోములు నోచుకుని ముత్తైదువులకు వాయనాలు ఇచ్చి పుచ్చుకున్నారు. కూచిపూడి శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో బాలమ్మ వరలక్ష్మీ దేవిగా ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం నుంచి కూచిపూడి, పెదపూడి, యద్దనపూడి, పెడసనగల్లు గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో శ్రీ చక్రానికి అర్చకులు పెనుమూడి పూర్ణ చంద్రశేఖర శర్మ, పెనుమూడి సతీష్ కుమార్ శర్మ, పెనుమూడి సుబ్రహ్మణ్య శాస్త్రి బంగారు పూలతో పూజలు నిర్వహించారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: మండలంలో వరలక్ష్మీ వ్రత వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ఉదయాన్నే మహిళలు పవిత్ర స్నానాలను ఆచరించి నూతన వస్త్రాలను ధరించారు. లక్ష్మీదేవికి ప్రీతికరమైన పిండివంటలు, పాయసం, పులిహోర, పూలు, పండ్లు సమర్పించి, కుటుంబ సమేతంగా వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి పంచామృత అభిషేకాలను వేద మంత్రోచ్చరణ నడుమ చేపట్టారు. అనంతరం సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు.

గుడివాడలో..

గుడివాడరూరల్: పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా జరిగాయి. స్థానిక బంటుమిల్లిరోడ్డులో వేంచేసియున్న శ్రీగంగా పార్వతీ సమేత భీమేశ్వరాలయంలో అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గౌరీశంకరస్వామి దేవస్థానం(చిన్న శివాలయం)లో అమ్మవారికి మంగళ సౌభాగ్యకరంగా గాజుల అలంకరణ చేశారు. మంగళగౌరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ఆలయ ఈఓ కందుల గోపాలరావు ఏర్పాట్లు చేశారు. దనియాలపేటలోని విజయదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారు శ్రీవరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలోని వానపాముల గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతి అమ్మవార్లను శుక్రవారం వరలక్ష్మీదేవిగా అలంకరించి, కుంకుమ పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు చిదాంబరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: వరలక్ష్మీ వ్రతాన్ని నియోజకవర్గంలో శుక్రవారం భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కైకలూరు శ్యామలాంబ అమ్మవారికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పట్టువస్త్రాలు సమర్పించారు. అదే విధంగా 20 మంది దాతల సాయంతో 16 కేజీలతో తయారు చేయించిన గర్భాలయ తలుపుల వెండి తొడుగుకు పూజలు చేశారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కలిదిండి మండలం చినతాడినాడ పంచాయితీ పల్లెపాలెంలో కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణనికి తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు నుంచి వచ్చిన రూ.10 లక్షల చెక్కును నిర్వాహకులకు అందించారు.



గుడివాడ చిన్న శివాలయంలో మంగళగౌరీదేవిగా అమ్మవారు



గుడివాడ విజయదుర్గ దేవస్థానంలో వరలక్ష్మీదేవిగా దర్శనం

నాణ్యమైన రొయ్య విత్తనం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

ముదినేపల్లి రూరల్: హేచరీల నిర్వాహకులు ఆక్వా రైతులకు నాణ్యమైన రొయ్యవిత్తనాన్ని సరఫరా చేయాలని స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వైవాకలో వనామి హేచరీని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ నాణ్యమైన సీడ్‌తోనే ఉత్పత్తి గణనీయంగా పెరిగి ఆక్వారైతులు లాభం పొందుతారన్నారు. హేచరీలు కేవలం లాభాపేక్షతోనే కాకుండా సామాజిక బాధ్యతగా హేచరీలు నిర్వహించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ వైఖరిపై ఆగ్రహం

ముదినేపల్లి రూరల్: మండల తహసీల్దార్ లతీఫ్‌బాషా వ్యవహారశైలిపై మండలంలోని చిన్నకామనపూడి పంచాయతీ సర్పంచ్‌తో పాటు పాలకవర్గ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ సమావేశం సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీకి చెందిన ఊరచెరువు సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించి పంచాయతీకి అప్పగించాలని కోరుతూ గతంలో పాలకవర్గం తీర్మానం చేసిందన్నారు. దీనికి ఏమాత్రం విలువ ఇవ్వకుండా తహసీల్దార్ అధికారపార్టీ నాయకుల ఒత్తిడికి ప్రలోభాలకు గురై తనకిష్టం వచ్చినట్లు వ్యవహరించారని ఆరోపించారు. పంచాయతీకి చెందిన ఊరచెరువు ఆక్రమణలకు గురికాగా దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా సర్వే చేయించాలని తహసీల్దార్‌ను ఆదేశించినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలను తుంగలో తొక్కి చెరువు సర్వే చేయకుండా ఆక్రమణలు లేవని గురువారం తనకు ఎండార్స్‌మెంట్ పంపడంలోని ఆంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు. ఈ వివరాలన్నీ తెలుసుకున్న పాలకవర్గ సభ్యులు తహసీల్దార్ వైఖరిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని సర్పంచ్‌కు సూచించారు. సమావేశంలో ఉపసర్పంచ్ శ్రీలక్ష్మీ, సభ్యులు నాగమల్లేశ్వరీ, ధనలక్ష్మీ, సహదేవుడు, వేదకుమారి, గంగా, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ముదినేపల్లి రూరల్: మండలంలోని వణుదుర్రు శివారు కొత్తపల్లిలో ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. గతంలో ఉన్న ఆలయం తొలగించి నూతనంగా నిర్మించేందుకు వేదపండితుల ఆధ్వర్యంలో రామిశెట్టి త్రిపాద్, భాగ్యలక్ష్మీ దంపతులు భూమిపూజ నిర్వహించారు.